క్లుప్తంగా

విజయవాడకు వెళ్లిన సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్: విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సంరక్షణ పనులు చేసేందుకు పంచాయతీ సిబ్బంది వెళ్లారని డీపీఓ లక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి పులిచెర్ల, తవణంపల్లె, వి.కోట, సదుం మండలాల నుంచి మొత్తం 25 మంది వెళ్లారన్నారు. వీరిలో కార్యదర్శులు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్లు ఉన్నారని, వీరంతా వారం పాటు అక్కడే సేవలు అందిస్తారని తెలియజేశారు.

నియామకం


జయచంద్రకుమార్

చిత్తూరు రూరల్(కాణిపాకం): రాష్ట్ర ఫార్మసిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న జయచంద్రకుమార్‌ను ఆదివారం ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల సురేష్‌బాబు నియామక పత్రాన్ని అందజేశారు. ప్రతి మెడికల్ స్టోర్‌లో ఫార్మసీ యాక్ట్ ప్రకారం ఫార్మసిస్ట్ ఉండేలా, డాక్టర్ అనుమతి లేకుండా మందు లు విచ్చలవిడిగా అమ్మకాలు చేయకుండా ఉండేందుకు, మెడికల్ స్టోర్ ఏర్పాటుకు ఫార్మసిస్ట్‌లకు రాయితీ రుణాల మంజూరుపై తాను కృషి చేస్తానని జయచంద్రకుమార్ తెలిపారు.

డీటీగా కళ్యాణి

గుడిపాల: డెప్యూటీ తహసీల్దార్‌గా కళ్యాణి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఇక్కడ డీటీగా పనిచేసిన ఆమె పెనుమూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. అయితే ఏర్పేడు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పెనుమూరు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. దీంతో ఆమె డీటీగా తిరిగి ఇక్కడికి రానున్నారు.

గర్భగుడి జీర్ణోద్ధరణ పనులకు భూమి పూజ

తవణంపల్లె: స్థానిక పురాతన శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం గర్భగుడి జీర్ణోద్ధరణ పనులకు గ్రామస్తులు ఆదివారం శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. గర్భగుడి శిథిలావస్థకు చేరుకోవడంతో నూతనంగా నిర్మించి జీర్ణోధారణ పనులు చేయించాలని తిరుమల-తిరుపతి దేవస్థానానికి ప్రతిపాదనలు పంపారు. దీనిని టీటీడీ పరిశీలించింది. గ్రామస్తులు 10 శాతం వాటా టీటీడీ నిధులు 90 శాతం చొప్పున రూ. కోటి మంజూరు చేసింది. ఈ క్రమంలో ఆగమశాస్త్రం ప్రకారం టీటీడీ ఆధ్వర్యంలో గర్భగుడి జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు.

కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే రేపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే)ను మంగళవారం నిర్వహించనున్నట్లు సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు దీనిని గమనించి 10న ఉదయం 10.30 గంటలకు గ్రీవెన్స్‌కు రావాలని కోరారు.

ఎస్పీ చవితి పూజలు


పూజలు చేస్తున్న చిత్తూరు ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు శనివారం తన క్యాంపు కార్యాలయంలో వినాయకున్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. గణపతికి నైవేద్యాన్ని సమర్పించి.. విశ్వాసం, భక్తికి పండుగలు అవసరమన్నారు. ఎస్పీతో పాటు క్యాంపు కార్యాలయ అధికారులు, సిబ్బంది పూజల్లో పాల్గొన్నారు.

కథాప్రపంచం పుస్తకావిష్కరణ


కథాప్రపంచం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

పలమనేరు: అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో కథాప్రపంచం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని పలమనేరు రచయితల సంఘం నిర్వహించింది. పట్టణానికి చెందిన దివంగత రసాయనశాస్త్ర అధ్యాపకులు మలిశెట్టి సీతారాం పేరిట ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ జాతీయస్థాయిలో నిర్వహించిన తెలుగు కథల పోటీల్లో బహుమతులు పొందిన కథలతో ఈ సంకలనాన్ని ప్రచురించారు. ముఖ్యఅతిథిగా రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, స్థానిక రచయితల సంఘం అధ్యక్షులు ఆర్ మాధవ్ చేతుల మీదుగా దీనిని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కొత్త రచయితలను ప్రోత్సహించేందుకు ఎమ్మెస్సార్ నిర్వాహకులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం కథాప్రపంచం 2023 సంకలాలను ఏమ్మెస్సార్ ట్రస్ట్ నిర్వాహకులు మలిశెట్టి శ్యామ్‌ప్రసాద్ రచయితలు, పాఠకులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కవులు, రచయితలు కుమారస్వామి రెడ్డి, యుగంధర్, సిద్ధార్థ, సీతారామయ్య, సుదర్శనాచారి, మురళీధర్, కేశవులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చవితి


చిత్తూరు గుర్రప్పనాయుడు వీధిలో..


చిత్తూరు: డీఐ రోడ్డులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- వాడవాడలా పండుగ వేడుకలు
- ఇంటా..వీధుల్లో పూజలందుకున్న గణనాథుడు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వినాయకచవితి సంబరాలు శనివారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ఊరువాడా మిరుమిట్లు గొలిపే మండపాల్లో ఠీవీగా ఆశీనుడైన గణనాథుడికి భక్తులు విశేష పూజలు చేశారు. విఘ్నాలు తొలగించి..విజయం సిద్ధింపజేయాలని, విజ్ఞానాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. చిత్తూరులోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. రెండో రోజు ఆదివారం కూడా విశేష పూజలు చేశారు.

తొలిపూజతో పాటు రాత్రి విశేష పూజలు చేసి స్వామికి నైవేద్యం సమర్పించారు. డప్పు వాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ సంబరాలు చేశారు. ప్రధానంగా డీఐ రోడ్డులో ఐదు భారీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో తెర తొలగించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ విగ్రహాలను తిలకించేందుకు చిత్తూరు నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామికి పూజాసామగ్రి సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే సంతపేట, తోటపాళ్యం, కొంగారెడ్డిపల్లె, గిరింపేట, కొంగారెడ్డిపల్లె, మురకంబట్టు, దొడ్డిపల్లె, వేపమాను వీధి, మిట్టూరు, సత్యనారాయణపురం, మాపాక్షి తదితర ప్రాంతాల్లో చవితి సంబరాలు కోలాహలంగా నిర్వహించారు.

నేడు నిమజ్జనం

సోమవారం కట్టమంచిలోని చెరువులో నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. క్రేన్ సైతం అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేసేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు.

మట్టి వినాయకునికి పూజలు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా కార్యాలయంలో మట్టి వినాయకుడుని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం సంఘ సభ్యులకు ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు నాగరాజులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేశ్‌బాబు, కోశాధికారి బాలాజి, సభ్యులు దేవా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఇళ్లలోనే మట్టి వినాయకుని ప్రతిమలు ఉంచి ఉపవాస దీక్షలతో పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యకు కుడుములు, ఉండ్రాళ్లు నైవేద్యంగా సమర్పించారు. ప్రసాదాలు పంచిపెట్టారు.

పూతలపట్టు నియోజకవర్గం

పూతలపట్టు: మండలవ్యాప్తంగా ప్రజలు శనివారం వినాయచవితి పండుగను ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో మట్టి వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అలాగే ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. సాయంత్రం యం.బండపల్లెలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం నిమజ్జనం చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఐరాలలో..

ఐరాల: వినాయకచవితి పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక వీఎస్.అగ్రహారంతో పాటు మండలంలో వివిధ గ్రామాలలో దాదాపు 50 పైచిలుకు వినాయకుని విగ్రహాలను ఉత్సవ కమిటీల నిర్వాహకులు ప్రత్యేక మండపాలలో ఏర్పాటు చేసి, లంబోదరుడునికి విశేష పూజలు చేశారు. వివిధ రకాల పండ్లు, ఉండ్రాళ్లు, గుగ్గిళ్లు మొదలైనవి నైవేద్యంగా సమర్పించారు. అలాగే స్థానిక వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద యువత, చిన్నారుల కోలాహలంతో సందడిగా ఉంటున్నాయి.

తవణంపల్లెలో..

తవణంపల్లె: వినాయక చవితిని మండలవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రతి గ్రామంలో పందిళ్లు వేసి మామిడి తోరణాలు, సుగంధ పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి, బొజ్జ గణపయ్య ప్రతిమలను ప్రతిష్ఠించారు. అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: వినాయక చవితి వేడుకలను శనివారం మండలంలో ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేశారు. మంగళతోరణాలు, విద్యుత్ దీపాలతో నయనానందకరంగా అలంకరించి, వాటిలో బొజ్జ గణపయ్యలను కొలువు దీర్చి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారికి ఇష్టమైన కుడుములు, ఫల, పత్రాలను నైవేద్యంగా సమర్పించారు. ఈ ఏడాదిలో తమకు ఎలాంటి కష్టాలు కలకుండా చూడాలని ప్రార్థించారు. మండలంలో పలు గ్రామాల్లో మట్టి వినాయకుని విగ్రహాలు పూజలందుకున్నాయి. 3, 5, 7, 9 రోజుల పాటు పూజలు నిర్వ హించిన తరువాత వినాయకుని నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.


చిత్తూరు రంగాచారి వీధిలో..


చిత్తూరు వేపమాను వీధిలో..



గుడిపాల: 189 కొత్తపల్లెలో.., బొమ్మసముద్రంలో..



పూతలపట్టులో యువకులు ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం, వీఎస్ అగ్రహారంలో..


బంగారుపాళెం: ఆర్ఆర్‌నగర్‌లో..


బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో..



తవణంపల్లెలో.., చిత్తూరులో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు

వరసిద్ధునికి రూ.12లక్షల వాహనం సమర్పణ

- వాహనదాతలే కూరగాయలు సైతం ఇచ్చారు

కాణిపాకం: పలమనేరుకు చెందిన శ్రీవారి సేవకులు రవీంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, జైల్ సింగ్ కలిసి కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలోని నిత్య అన్నదానానికి కూరగాయలు అందజేసేందుకు (టాటాయోధ) రూ. 12 లక్షల వాహనం అందజేశారు. అలాగే 2.5 టన్నుల వివిధ రకాల కూరగాయలు ఇచ్చారు. అలాగే బంగారుపాళ్యం మండలం కొత్త వెంకటాపురం గ్రామానికి చెందిన దాత మోహన్‌నాయుడు నిత్యాన్నదానం ట్రస్టుకు రూ. 1,11,116 విరాళాన్ని ఎమ్మెల్యే, ఈవోకు అందజేశారు.


వాహనం అందజేస్తున్న శ్రీవారి సేవకులు

వరసిద్ధుని సేవలో ప్రముఖులు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ రెడ్డి, కేంద్ర ఎన్ఆర్ఈజీఎస్ డిప్యూటీ సెక్రటరీ ఆశిష్ గుప్త తమ కుటుంబ సభ్యులతో వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



స్వామి సేవలో రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి, స్వామి చిత్రపటం అందుకుంటున్న ఎన్ఆర్ఈజీఎస్ డిప్యూటీ సెక్రటరీ

గణనాథుని బ్రహ్మోత్సవం


గణపతి వ్రతంలో భాగంగా స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


మూషిక వాహనంపై ఊరేగుతున్న వరసిద్ధి వినాయకస్వామి


చవితితో కిటకిటలాడిన భక్తులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని ఆస్థాన మండపంలో ఆదివారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలు జిల్లాల నుంచి వచ్చిన యువతీ యువకులు, కళాకారులు తమ ప్రతిభను చాటుతూ ప్రదర్శనలు ఇచ్చారు. భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, భక్తిగీతాలపాలనతో అలరించారు. గోపాలకృష్ణ నాట్యమండలి కళాకారుల పౌరాణిక నాటక ప్రదర్శన రెండు గంటల పాటు సాగింది. హరికథా కాలక్షేపం, కోలాటాలతో మండపం కళకళలాడింది.

మహాభారత యజ్ఞం ప్రారంభం

తవణంపల్లె: స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ఆదివారం మహాభారత యజ్ఞంకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ నెల 30వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రతి రోజూ భాగవతారిణి స్వర్ణలత హారిక థాగానానం చేస్తారని ఆలయ ధర్మకర్త మునస్వామి శెట్టి, కార్యనిర్వాహకులు తెలిపారు.

చిట్టిబాబుకు అవార్డు


అవార్డు అందుకుంటున్న చిట్టిబాబు

చిత్తూరు కలెక్టరేట్: స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ చిట్టిబాబు గురుదేవో భవ అవార్డు అందుకున్నారు. ఆదివారం తిరుపతి జిల్లా కేంద్రంలో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంకయ్య చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపు తనకీ పురస్కారం ప్రదానం చేశారని చిట్టిబాబు చెప్పారు. ఆయనను డీఈవో సయ్యద్ మౌలా, పీసీఆర్ ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్, కళాశాల లెక్చరర్లు అభినందించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. దీనిని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.